క్లుప్తంగా

ఆర్డీఓకు మేయర్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు గ్రీన్‌ఫీల్డ్ హైవే కిందపోయాయని, సదరు స్థలాల యజమానులకు నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఆర్డీఓకు ఖమ్మం మేయర్ నీరజ వినతిపత్రం అందజేశారు. రహదారి నిర్మాణంలో నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని ఆమెతో పాటు బాధితులు కోరారు.

పంచాయతీ కార్యాలయానికి కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న దాతలు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి పంచాయతీ కార్యాలయానికి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కుర్చీలు విరాళంగా అందించారు. మాజీ సర్పంచ్ కూరాకుల నర్సయ్య తనయుడు గోపి, పంచాయతీ కార్యదర్శి చెన్ను నాగరాజు విజ్ఞప్తి మేరకు రూ.12 వేల విలువైన 25 కుర్చీలను గురువారం గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుంపటి నాగేశ్, లచ్చయ్య, ఆరెంపుల వెంకటేశ్వర్లు, చావా రామయ్య, కొనకంచి రామచంద్రయ్య, అప్పని శంకర్, వడ్లమూడి వెంకటయ్య, వుయ్యూరు లక్ష్మయ్య, కొండపర్తి జగన్, చావా భద్రయ్య, చచ్చు లక్ష్మీనారాయణ, పావురాల నర్సయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వాహనం కొనుగోలు సమయాన బీమా చేయించినా, ప్రమాదం జరిగినప్పుడు వాహన మరమ్మతులు ఖర్చులన్నీ తనతోనే కట్టించారని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లపురానికి చెందిన కొప్పెర వెంకటేశ్వర్లు వాపోయారు. ఖమ్మంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఓ షోరూంలో డీసీఎం వ్యాన్ కొనుగోలు చేసిన మూడు నెలలకు ప్రమాదం జరిగిందని తెలిపారు. అయితే, షోరూం బాధ్యులు, ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది కలిసి మరమ్మతు ఖర్చులు తన నుంచే వసూలు చేశారని వెల్లడించారు. ఈమేరకు అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట వరలక్ష్మి, నాగయ్య, బుద్ధి వెంకన్న, నరేష్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కామేపల్లి: మండలంలోని గోవింద్రాలలో రైతు లకావత్ భీముడుకు చెందిన పాడి ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ సమీపంలో మేతకు వెళ్లగా ఎర్త్ వైరుకు తాకడంతో ఆవు షాక్‌కు గురైంది. ఘటనాస్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. రూ.80 వేలు విలువైన ఆవును కోల్పోయిన తనకు పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరాడు.

నగరంలో సినిమాలు

తిరుమల	మా. కుబేర
వినోద	ఎఫ్1: ద మూవీ,
	సితారే జమీన్ పర్
సాయిరాం	మార్గన్
ఆదిత్య	కన్నప్ప
శ్రీనివాస	కుబేర

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	66	చుక్కకూర	3
బీర	46		20
దొండ	38	తోటకూర	4
పొట్లకాయ	46		20
చిక్కుడు	66	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	32		30
క్యారెట్	50	పుదీన	1
బీట్‌రూట్	40		20
క్యాప్సికం	86	–ఖమ్మం వ్యవసాయం	

ఆదాయ మార్గాలపై అన్వేషణ

కొత్త మున్సిపాలిటీకి వనరులపై ఆరా

- అవకాశాలను పరిశీలిస్తున్న ఏదులాపురం మున్సిపల్ అధికారులు
- తొలుత ట్రేడ్ లైసెన్సుల జారీపై కసరత్తు



ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మంరూరల్: అసలే నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ.. పైగా గతంలో ఉన్న 12 గ్రామ పంచాయతీలను కలిపి కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ కావడంతో మున్సిపల్ పరిధిలో పనులు చేపట్టడానికి కొంత ఆర్థిక ఇబ్బంది నెలకొంది. మున్సిపల్ అధికారులు సిబ్బంది సహకారంతో మున్సిపల్ ఆదాయాన్ని పెంచేందుకు మార్గాల అన్వేషణలో మునిగి తేలుతున్నారు. కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుండి వచ్చే నిధులకు తోడు మున్సిపల్ పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధికి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.90 కోట్లు మంజూరు చేయగా ఆ నిధులతో అత్యసరమైన పనులు చేపట్టారు.

ట్రేడ్ లైసెన్సులతో రూ.20 లక్షలు..

ఇదిలా ఉండగా గతంలో పంచాయతీలుగా ఉన్న సమయంలో ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడు మున్సిపల్‌లో విలీనమైన వెంకటగిరి, పెదతండా, ముత్తగూడెం, ఏదులాపురం, గుర్రాలపాడు, మద్దులపల్లి, గొల్లగూడెం, బారుగూడెం, రెడ్డిపల్లి, తెల్దారుపల్లి, గుదిమళ్ల తదితర గ్రామాల పరిధిలో వివిధ కూడళ్లలో పలు వ్యాపారాలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటి వరకు వారంతా లైసెన్స్ లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. ఇప్పటి నుంచి మున్సిపల్ నిబంధనల ప్రకారం వ్యాపారం చేయాలంటే అధికారులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు. దీంతో పాటు ఇప్పటికే పలు వ్యాపారాలు చేస్తున్న వారంతా తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. నిబంధనలు పాటించని వ్యాపారులపై మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మున్సిపల్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో దాదాపు వెయ్యి వరకు పలు రకాల దుకాణాలున్నట్లు సమాచారం. వీటన్నింటిపై లైసెన్స్ రూపేణా మున్సిపల్ ఖజానాకు దాదాపు రూ. 20 లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇందులో కమిషనర్ ఆయా ప్రాంతాల కార్యదర్శులు మున్సిపల్ సిబ్బందితో సర్వే చేయిస్తున్నారు.

ఆదాయంపై తర్జనభర్జన

మున్సిపల్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. ఇంకా పలు అభివృద్ధి పనులు కూడా ఎక్కడివక్కడే అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీలో ఏ పని చేయాలన్నా లక్షల్లో నిధులు అవసరమవుతాయి. ఈ నిధులను ఎలా సమకూర్చుకోవాలోననే విషయమై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఆదాయం సమకూరే ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా వదులుకునే పరిస్థితిలో అధికారులు లేరు. ప్రస్తుతం పలు రకాల ప్రయత్నాలతో మున్సిపాలిటీకి కొంత ఆదాయం సమకూరే అవకాశం ఉండటంతో కొంత ఊరట లభించినట్లయింది.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతీ దుకాణాదారుడు విధిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. గతంలో ఎలాంటి లైసెన్స్ ఉన్నా ఇప్పుడు మాత్రం మున్సిపాలిటీ చట్టం ప్రకారం తప్పకుండా తీసుకోవాల్సిందే. మున్సిపల్ పరిధిలో ఎన్ని దుకాణాలున్నాయనే వివరాలను సేకరిస్తున్నాం. మరో కొద్దిరోజుల్లో దుకాణాదారులకు కొత్త ట్రేడ్‌లైసెన్స్‌లు ఇస్తాం. మున్సిపాలిటీకి ఆదాయం పెంచేందుకు, అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నాం.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్

పక్కాగా పారిశుద్ధ్య పనులు..

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46, 52వ డివిజన్లలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 46వ డివిజన్‌లో జటాయు వాహనం పనితీరును పరిశీలించారు. జటాయు వాహనం డ్రైవర్‌తో మాట్లాడి రోజువారీ పని చేసే ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. 52వ డివిజన్‌లో జరుగుతున్న గ్యాంగ్‌వర్క్‌ను పరిశీలించిన కమిషనర్ పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం, కాల్వలు పనులు చేసేటప్పుడు బూట్లు ధరించాలని సూచించారు. బూట్లు లేని కార్మికులకు తక్షణమే బూట్లు అందజేయాలని శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యను ఆదేశించారు.

వరదలపై అధికారులతో సమీక్ష..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గత వరదలను, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. కేఎంసీ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. గతేడాది ప్రభావితమైన డివిజన్లలోని ముంపు ప్రాంతాలను గుర్తించి, తక్షణ స్పందన కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వలంటీర్లను నియమించి, వారికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. నీటి మట్టం 16 అడుగులు దాటినప్పుడు ప్రజలను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వలంటీర్లకు టార్చ్‌లైట్‌లు, రెయిన్ కోట్లు, లైఫ్ జాకెట్లతో పాటు వరద సమయంలో ఉపయోగించదగిన బోట్లు ఇతర సహాయక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ డివిజన్‌కు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను యాక్టివేట్ చేసి, సమాచార మార్పిడిని వేగవంతం చేయాలన్నారు. శుక్రవారం అన్ని ముంపు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

ఆస్పత్రికి రూ.18 వేల జరిమానా..

నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి కేఎంసీ శానిటేషన్ అధికారులు రూ.18 వేల జరిమానా విధించారు. ఆస్పత్రి యాజమాన్యం బయో మెడికల్ వ్యర్థాలను చెత్తలో కలపడాన్ని గుర్తించి జరిమానా విధించారు.

పాలేరులో యూరియా కొరత లేదు..



చెన్నారంలో పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న ఏడీఏ సరిత

నేలకొండపల్లి: పాలేరు డివిజన్‌లో యూరియా కొరత లేదని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.సరిత అన్నారు. మండలంలోని చెన్నారం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. పంటలను పరిశీలించి, రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్, జూలై మాసాలకు సంబంధించి రైతులకు యూరియాకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. డివిజన్‌లోని అన్ని సొసైటీలు, దుకాణాల్లో యూరియా సిద్ధంగా ఉందన్నారు. ఎరువుల ధరలను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాక్‌లో విక్రయించిన సహించేది లేదని, రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుల మందులు వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం.రాధ, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి



తిరుమలాయపాలెం: ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి



నేలకొండపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



కామేపల్లిలో..

తిరుమలాయపాలెం: జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పిండిప్రోలులో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఒకప్పుడు పట్టణాల్లో ఉన్న డ్రగ్స్ వినియోగం నేడు పల్లెలకూ చేరుతుందని వాటి బారిన పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై కూచిపూడి జగదీష్, అదనపు ఎస్సై రామలింగారెడ్డి, కానిస్టేబుళ్లు వీరస్వామి, వెంకటేష్ రాజు, సర్దార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి: విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ అన్నారు. ఈ మేరకు మాదకద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా కొత్తలింగాల క్రాస్ రోడ్డులో పోలీసులు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి వివేకభారతి స్కూల్ ప్రిన్సిపల్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, రమేష్, నారాయణస్వామి ఉన్నారు. అదే విధంగా పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించగా ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

'సీతారామ'కు అధిక నిధులు కేటాయించాలి



సమావేశమైన రైతు సంఘం నాయకులు

కామేపల్లి: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, త్వరితగతిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం బృందం ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించి అనంతరం పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాజెక్ట్ పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తి చేసి ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులు పూర్తి కాకముందే ఆర్భాటంగా సాగర్ కెనాల్‌కు నీటిని విడుదల చేసి నిలిపివేసిందన్నారు. మండలంలో సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణానికి 516 ఎకరాలను రైతుల నుంచి స్వాధీనం చేసుకొని నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాదావత్ శ్రీను, వజ్జా రామారావు, అంబటి శ్రీనివాసరెడ్డి, దుగ్గి కృష్ణ, దొండపాటి నాగేశ్వరరావు, కృష్ణార్జున్‌రావు, చలపతిరావు, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు..



బురదమయంగా మారిన కాలనీలోని రోడ్డు

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ మేరకు ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్డుపైకి చేరటంతో పాటు కొద్దిపాటి వర్షాలకు చిత్తడి అవుతున్నారు. ఈ రహదారుల్లో నడవటం, వాహనాలు వెళ్లటం ఇబ్బందిగా మారుతుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద రహదారి బురదమయంగా మారింది. ఇకనైనా అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రైవేట్ టీచర్ల డిమాండ్లు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ టీచర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలానుగుణంగా ప్రైవేటు టీచర్లు, అధ్యాపకులను వేతనాలను కూడా పెంచాలని, త్వరలో తమ సంఘం ఆధ్వర్యంలో ట్రస్మా నాయకులకు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు



వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం 46 డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ దంపతులు గురువారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అంతేకాక డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దంపతులు మాట్లాడుతూ.. కన్నం కనకయ్య వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, నాయకులు బాల్దె నాగేశ్వరరావు, కన్నం రమేష్, వేముల విజయ్, సెల్వం జ్ఞానేశ్వర్, గర్శకోటి కిషన్, సుదగాని నరేష్, బచ్చ సాయి, కంకల రాజేష్, మోటె జగదీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం



మాట్లాడుతున్న ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చి, హైకోర్టు ఆదేశాల పేరుతో ఎన్నికలు నిర్వహించాలనుకోవటం సరి కాదని బీసీ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వేషన్ తేల్చకుండా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. బీసీలంతా ఒకే తాటి పైకి వచ్చి 42 శాతం రిజర్వేషన్ కోసం పోరాటాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌జేసీ కృష్ణ, కూరాకుల నాగభుషణం, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల కోసం సూక్ష్మ ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: పంచాయతీల అవార్డుల కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా 2023–24 జరిగిన అభివృద్ధిపై ప్రగతి సూచికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాదిలో జరిగిన అభివృద్ధి పనుల ప్రకారం అవార్డులకు ఎంపిక చేయనున్నామని, అన్ని శాఖల అధికారులు ఫార్మెట్ ప్రకారం కార్యచరణ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంపై అప్రమత్తం చేసి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ సీహెచ్.శివ, ఎంఈఓ బి.చలపతిరావు, ఎస్సై సంతోష్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకే కులవృత్తి హక్కులు కేటాయించాలి



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: నాయీ బ్రాహ్మణులకే తమ కులవృత్తి హక్కులు చెందే విధంగా సహకరించాలని కోరుతూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణులను షెడ్యూల్ కులాల్లో చేర్చి, పేటెట్ హక్కు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం భవన నిర్మాణానికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఈటల మాట్లాడుతూ... కులవృత్తుల వారికి ఎల్లప్పుడూ బీజేపీ సహకారం అందిస్తుందని, కులవృత్తులను కొల్లగొట్టే కార్పొరేట్ సెలూన్లకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి సన్మానం..

బీజేపీ నాయకుడు వక్కాలంక సుబ్రమణ్యంను ఎంపీ ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు, గెంటెల విద్యాసాగర్, రుద్రప్రదీప్, మేకల నాగేందర్, డాక్టర్ జీవీఆర్, అల్లిక అంజయ్య, మార్తి వీరభద్ర ప్రసాద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నివాళి..



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: రిజర్వేషన్ పితామహుడు కొల్లాపూర్ మహారాజు ఛత్రపతి సాహు జి మహారాజ్ జయంతి వేడుకలను గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మట్టే నాగేశ్వరరావు, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, కొమ్ము వీరబాబు, సురేష్, వెంకటేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలం.. పాత మున్సిపల్ కార్యాలయం



నగరంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రమాదకరంగా మారింది. భవనంపై మొక్కలు మొలచి పెరిగాయి. ప్రస్తుత వర్షాకాలంలో వానలు కురిస్తే.. అసలే ఎప్పుడో నిర్మించిన భవనం గోడలు నాని కూలే ప్రమాదం పొంచి ఉంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్